## ఉపాధ్యాయులు బోధన పద్ధతులు మార్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి

**మేడ్చల్‌కలెక్టరేట్,మే21:** శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం నాగారం సెయింట్ మార్టిన్ పాఠశాలలో ఎంఈవో జమదగ్ని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు బోధన పద్ధతులను మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచి,తరగతి వారీగా కనీస సామర్థ్యాలను సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఐదు రోజుల శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు వినియోగించుకొని జిల్లాను విద్యా ప్రమాణాల్లో మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ మేకల సునీత

**నేరేడ్‌మెట్, మే 21:** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ బుధవారం కలిసి డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని, డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు డ్రైనేజీ రోడ్లు, బాక్స్ డ్రైనేజీలు, పారిశుధ్య పనుల కోసం అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాముయాదవ్ పాల్గొన్నారు.

## నూతన నియామకం

**రామంతాపూర్,మే 21:** నాచారం ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్‌గా రాజీవ్‌నగర్ ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నరహరిని, కోకన్వీనర్ గా కనకమేడల రాంబాబును నియమించారు. బుధవారం జేఏసీ రాష్ట్ర చైర్మన్ నల్లరాధాకృష్ణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.



కబ్జా చేసిన నిర్మాణాలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం



పర్వతాపూర్‌లోని ఆక్రమణకు గురైన మైనార్టీ గ్రేవ్‌యార్డును పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్, అధికారులు

# పీర్జాదిగూడలో హైడ్రా కూల్చివేతలు

**పీర్జాదిగూడ, మే 21 :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నంబర్ 26ఏ, సీపీఆర్ఐ పవర్ సంస్థ, సెజ్ స్కూల్ ప్రాంగణంలో ఆర్ఏఆర్ కాలనీకి సంబంధించిన రోడ్డు కబ్జా చేసి ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టారని కాలనీ వాసులు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం హైడ్రా అధికారులు చేరుకుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సీఐ సైదులు నేతృత్వంలో జేసీబీలతో రోడ్డు ఆక్రమణలను పూర్తిగా నేలమట్టం చేశారు. 15 సంవత్సరాలుగా రోడ్డు కబ్జాపై పోరాడుతున్నామని, హైడ్రా మూలంగా ఇన్నేండ్లకు తమ కాలనీకి సంబంధించిన రోడ్డు వినియోగంలోకి రాను ఉం డడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### కమిషనర్ రంగనాథ్ పర్యటన

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. మున్సిపల్ పరిధి పర్వతాపూర్ సర్వే నంబర్ 1లో మైనార్టీ గ్రేవ్‌యార్డు కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తుల ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారనే ఫిర్యాదు మేరకు కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మైనార్టీ గ్రేవీ యార్డులో నిర్మాణాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

## హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు రాములు

**ఘట్‌కేసర్, మే 21:** మహిళలను చెట్ల పొదల్లోకి తీసుకు వెళ్లి లైంగిదాడి, హత్య చేసిన నిందితునికి మేడ్చల్ అడిషనల్ జిల్లా జడ్జి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం...2021 జనవరి 4న ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి అంకుషాపూర్ గ్రామ శివారులోని రైల్వేట్రాక్ వద్ద ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోని ముండ్లపొదల్లో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పంచనామా జరిపిన అనంతరం పోస్టుమార్టం తరలించారు. గుర్తు తెలియని మహిళ నగరానికి చెందిన కూర వెంకటమ్మని తెలుసుకున్న పోలీసులు ఆ దిశలో విచారణ జరపగా సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన మైనంపల్లి రాములు అలియాస్ బొట్టు రాములు(47) లైంగిదాడి చేసి హత్య చేయడంతో పాటు ముఖాన్ని గుర్తుపట్టకుండా కాల్చినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు పూర్తి ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేయగా బుధవారం జిల్లా అడిషనల్ జడ్జి పూర్వపరాలు పరిశీలించి నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, రూ.8వేల జరిమానా విధించారు. నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదని, ఎంతటివారైనా నేరం నుంచి తప్పించుకోలేరని ఇన్ స్పెక్టర్ పరశురాం తెలిపారు.

## 7211 టన్నుల ధాన్యం సేకరణ

**మేడ్చల్, మే 21:** జిల్లాలో ఏర్పాటు చేసిన 14ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 7211.440 టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, అలియాబాద్, జగన్‌గూడ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7211.440 టన్నుల ధాన్యాన్ని 1055మంది రైతుల నుంచి 6133.680 టన్నుల దొడ్డు రకం ధాన్యం, 261 మంది రైతుల నుంచి 1077.760 టన్నుల సన్నకరం ధాన్యం కొనుగోలు చేశామన్నారు. లక్ష్యం మేరకు కొనుగోలు కేంద్రాల్లో తగినంత హమాలీలను ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులు తీసువచ్చే ధాన్యంలో ప్రమాణాల ప్రకారం తేమ ఉండాలని, తాలు, మట్టి పెళ్లలు లేకుండా చూసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ప్రమాణాల మేరకు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.



శామీర్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఎస్‌వో శ్రీనివాస్ రెడ్డి

## యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు,కార్పొరేటర్ శ్రీవాణి.

**రామంతాపూర్,మే 21:** డివిజన్ పరిధి వివేక్‌నగర్, శాంతినగర్, ఇంద్రానగర్‌లో అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు అన్నారు.బుధవారం డివిజన్‌లో కోటి రూ.1.40 లక్షలతో బాక్స్ డ్రైన్, సీసీరోడ్లను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీ ఆంజనేయులు, ఈఈ హరిలాల్, డీఈ నాగమణి, ఏఈ శ్వేతాశ్రీ, డీఈ చందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, పాల్గొన్నారు.

## మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాం




సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటగోపాల్

**శామీర్‌పేట, మే 21 :** తూంకుంట మున్సిపాలిటీలో కేంద్రం ప్రవేశపెట్టిన అమృత్ 3.0 కార్యక్రమంలో భాగంగా విమెన్స్ ఫర్ ట్రీ అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. బుధవారం తూంకుంట పురపాలక సంఘం కార్యాలయంలో విమెన్స్ ఫర్ ట్రీపై సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి, మొక్కలు నాటేందుకు గాను ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ సునీత, మెప్మా ఆర్పీలు, కార్యాలయ వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి..నిందితుడిపై పోక్సో కేసు

### జవహర్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

**జవహర్‌నగర్, మే 21:** ఓ బాలికపై నిందితుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి గబ్బిలాల్‌పేట్ కేసీఆర్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ గబ్బిలాల్‌పేట్ కేసీఆర్ నగర్‌లో అమ్మమ్మ వద్ద బాలిక ఉంటుంది. కర్నూలు జిల్లాకు చెందిన గుడిపాటి రాజు (35) ఆటో నడుపుతూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అదేకాలనీలో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఇంట్లో కుటుంబసభ్యులు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని ఒంటరిగా ఇంట్లో ఉన్న బాలిక(14) వద్దకు వెళ్లి మాయమాటలు చెప్పి లైంగిదాడికి పాల్పడ్డారు. దీంతో బాలిక ఏడ్చుచుకుంటూ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపింది. బాలిక కుటుంబసభ్యులు బుధవారం జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లోక్ అదాలత్‌తో సమస్యలకు శాశ్వత పరిష్కారం




జాతీయ లోక్ అదాలత్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్. శ్రీదేవి తదితరులు

**చర్లపల్లి, మే 21 :** లోక్ అదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్. శ్రీదేవి పేర్కొన్నారు. కుషాయిగూడలోని జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జాతీయ లోక్ అదాలత్ గోడ పత్రికను ఆమె జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి డి.కిరణ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల తరబడి వివాదంలో ఉన్న రెవెన్యూ, కుటుంబ సమస్యలను లోక్ అదా లత్ ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు జడ్జీలు, న్యాయవాదులు, కుషాయిగూడ, చర్లపల్లి, ఘట్‌కేసర్, కీసర, నేరడ్‌మెట్, మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

**బోడుప్పల్, మే 21:** బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ఈ కింది నెంబర్లకు ఫిర్యాదు చేయాలని ఏఈ ఎన్ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సేవలందించిన ఫోన్ నంబర్లు అధికారికంగా మార్చబడినట్లు ఆయన తెలిపారు. ఏఈ సెల్‌నంబర్: 87124715 75. ఫ్యూజ్ ఆఫ్ కాల్ 8712471618. లైనింగ్ ఇన్స్పెక్టర్ (1). 8712471587. లైనింగ్ ఇన్స్పెక్టర్ (2) 8712471588. లైన్మెన్ 8712471600. ఫోర్ మెన్ 8712471581 ఫోన్ నంబర్లను అధికారికంగా ప్రకటించినట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇతర సమస్యలకు ఈ నంబర్లలో ఫిర్యాదు చేసి సేవల పొందవచ్చని ఆయన స్పష్టం చేశారు.

## సెంట్రింగ్ మేస్త్రీ అదృశ్యం



సత్యానందు (ఫైల్)

**మల్కాజి గిరి, మే 21:** సెంట్రింగ్ మేస్త్రీ అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కొండలు కథనం ప్రకారం.. మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన సత్యానంద్ (47) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈనెల 20న పని ముగించుకొని మరో ఇద్దరుతో కలిసి బైక్‌పై వస్తు జడ్పీఎస్ చౌరస్తాలో సిగ్నల్ వద్ద ఆగారు. బంధువు హేమరాజ్ సత్యానంద్‌ను ఇక్కడే ఉండమని మరొకరిని ఇంటి వద్ద దించి వస్తానని వెళ్ళాడు. హేమరాజ్ తిరిగి బైక్‌పై జెడ్‌టీఎస్ చౌరస్తాకు వచ్చి సత్యానంద్ కోసం వెతికాడు. రాత్రికి ఇంటికి రాలేదు.

దీంతో ఆయన స్నేహితులు అంతటా వెతికినా ఆచూకీ దొరకలేదు. బంధువు హేమరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధికి మారుపేరు చిల్కానగర్ డివిజన్

**రామంతాపూర్ ,మే 21:** చిల్కానగర్ డివిజన్‌లో రూ.39 లక్షలతో నిర్మిస్తున్న బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం మొదటి అంతస్తు స్లాబ్ పనులను కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ బుధవారం పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని దశలవారీగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. డివిజన్లో సుమారు రూ.90 కోట్ల నిధులతో ఇప్పటివరకు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్,బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్. నాయకులు నారాయణరెడ్డి, జగన్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## 'మెరుగైన వైద్యసేవలు అందాలి'



జిల్లా దవాఖానలో పర్యటిస్తున్న టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

కొండాపూర్, మే 21 : దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు పరిశుభ్రతమైన వాతావరణాన్ని కల్పించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానను సందర్శించారు. దవాఖానలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందజేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ చంద్రకృష్ణ ఉన్నారు.

## శాశ్వత పరిష్కారం చూపాలి



ఎస్ఎన్‌డీపీ అధికారులతో మాట్లాడుతున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం

అల్లాపూర్, మే 21 : సున్నంచెరువు ఎగువ నుంచి మైసమ్మ చెరువు దిగువకు నాలా విస్తరణ పనులు వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం ఎస్ఎన్‌డీపీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈఈ శ్రీనాథ్ రెడ్డి, డీఈ రాజ్యలక్ష్మితో కలిసి కార్పొరేటర్ లక్ష్మీ నగర్, సర్దార్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ మీదుగా మైసమ్మ చెరువు లోకి ప్రవహించే నాలాను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముంపు సమస్య తలెత్తకుండా నాలా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, మే 21 : ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దతూప్ర గ్రామానికి చెందిన పాలమూరు బాల్‌రాజ్ తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామలోని ఓ అద్దె ఇంట్లో నివాస ముంటున్నాడు. అతడి కుమారుడు ప్రవీణ్‌గౌడ్(33) షాద్‌నగర్‌లోని బజాజ్ ఫైనాన్స్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే 15 రోజుల క్రితం బాల్‌రాజ్ తన పెద్దకుమార్తె వద్దకు నగరంలోని అల్వాల్‌కు వెళ్లాడు. ఈ నెల 20న తన కుమారుడికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో తండ్రి స్వగ్రామానికి చేరుకొని ఇంట్లోకి వెళ్లి చూడగా అతడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందిన్నట్లు వివరించారు. అతడు ఒంటరిగా ఇంట్లో ఉండడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అక్రమ నిర్మాణాల జోరు

### చోద్యం చూస్తున్న అధికారులు



దుండిగల్,మే 21 :అధికారుల పర్యవేక్షణ లోపం, కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. కొందరు తమ భవనాల నిర్మాణం కోసం మున్సిపాలిటీ నుంచి జి+2 అంతస్తులకు అనుమతులు తీసుకొని ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారు. మరికొందరు ఏకంగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందకుండానే నిర్మాణాలు చేపట్టడం చూస్తుంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అంటున్నారు స్థానికులు. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట, సింహపురి కాలనీలో ఇటీవల అక్రమ నిర్మాణాల సంఖ్య పెరిగిపోతుందనీ స్థానికులు వాపోతున్నారు. వీటివల్ల భవిష్యత్తులో మౌలిక వసతులు కల్పన సైతం మునిసిపాలిటీకి ఇబ్బందికరంగా మారే పరిస్థితులు ఉన్నా సిబ్బంది, అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వ్యక్తి 380 గజాల స్థలంలో బహుళ అంతస్తుల భవనం ని ర్మించేందుకు మునిసిపాలిటీ నుంచి టీఎస్ బిపాస్ కింద జి+2 అంతస్తులకు అనుమతులు తీసుకొని ఇప్పటికే ఏకంగా 5 అంతస్తులు నిర్మించారు. అది చాలాదన్నట్లు మళ్లీ పెంట్ హౌస్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తుండడంస్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వ్యాపార లావాదేవీలపై చర్చించేందుకు పిలిచి దాడి

బంజారాహిల్స్,మే 21: వ్యాపార లావాదేవీలపై చర్చించేందుకు పిలిచి వృద్ధుడిపై దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి ప్రాంతానికి చెందిన పి.చిరంజీవ చారి(67) రెండు నెలల క్రితం శ్రీనివాసరాజ్, అతడి కొడుకు రోహిత్ రాజ్ అనే వ్యక్తితో కలిసి ఘనా దేశానికి బిజినెస్ పనిమీద వెళ్లారు. కాగా అక్కడ రూ.45వేల అమెరికా డాలర్ల మేర న ష్టం వచ్చింది. కాగా ఈ విషయంపై చర్చించుకుందామంటూ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని అజీమ్ అనే వ్యక్తికి చెందిన ఆఫీసుకు పిలిపించారు. అనంతరం మాట్లాడుతున్న క్రమంలో కొన్ని సంతకాలు పెట్టాలని కోరగా చిరంజీవ చారి నిరాకరించాడు. దీంతో శ్రీనివాస్‌రాజ్ తనమీద దాడికి పాల్పడడంతో కిందపడిపోయానంటూ బాధితుడు బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇటుక బట్టి నిర్వాహకుడి అరాచకాలపై విచారణ



కేశవరం పంచాయతీకి తరలించిన కార్మికులు

**శామీర్‌పేట, మే 21:** మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలోని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వ్యక్తి అరాచకాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులను నిర్వాహకుడు దుర్భాషలాడుతూ మానసికంగా వేధిస్తున్నాడు. భౌతికంగా దాడులకు పాల్పడుతున్నాడు. ఈ విషయం బయటకు చెబితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని కార్మికులను బెదిరిస్తున్నాడు. నిర్వాహకుడి అరాచకాలు భరించలేని ఇద్దరు కార్మికులు ఒడిశాకు పారిపోయి ఎన్జీవో సాయంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ వెంకట నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి, ఇటుక బట్టీల్లో పని చేస్తున్న 70 మందిని పంచాయతీ కార్యాలయానికి తీసుకువచ్చి, విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఇటుక బట్టీ నిర్వాహకుడు కనీస వసతులు కల్పించకపోగా వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నాడని, ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని వెల్లడించినట్టు తెల్సింది. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు పంచాయతీ కార్యాలయం ఆశ్రయం ఇవ్వనున్నట్టు వారు తెలిపారు.

## నేషనల్ ఆర్చరీకి రాంపల్లి యువకుడు ఎంపిక

**మేడ్చల్ కలెక్టరేట్, మే 21:** నేషనల్ జడ్జెస్(రిఫరీ) ఆర్చరీకి నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ ఎంపికయ్యారు. ఫిబ్రవరి24 నుంచి 26 వరకు బెంగళూరులో ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ ఆర్చరీ జడ్జెస్ (రిఫరీ)సెమినార్‌కు రాష్ట్రం నుంచి పది మంది పాల్గొన్నారు. ఈ మేరకు ఈనెల 20న వచ్చిన ఫలితాల్లో ముగ్గురు ఎంపికయ్యారు. రాంపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ ఎంపిక కావడంలో గ్రామస్తులు అభినందించారు. భానుచందర్ ప్రస్తుతం కాప్రాలో అకాడమీ, రిక్యాల్ఫోర్డ్ ఇంటర్ నేషనల్ స్కూల్ రాంపల్లి ఆర్చరీ కోచ్‌గా పనిచేస్తున్నాడు.

## విద్యార్థులకు స్కిల్ ట్రైనింగ్ శిక్షణ శిబిరం

**ఉప్పల్,మే 21:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్– లక్ష్–ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉద్యోగ శిక్షణా శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. శిక్షణను ప్రారంభిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమార్ కళాశాల, లక్ష్ –ఇన్ఫోసిస్ ఫౌండేషన్ తో ఒప్పందం కుదుర్చుకుందని, అందులో భాగంగా స్కిల్ ట్రైనింగ్ ఉద్యోగ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉప్పల్ కళాశాల లో డిగ్రీ చివరి సంవత్సరం పూర్తయిన విద్యార్థులే కాకుండా ఇతర ప్రభుత్వ , ప్రైవేట్ కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం వారం రోజులు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం త్వరలో డిగ్రీ చివరి సంవత్సరం,డిగ్రీ పూర్తైన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వనాథ్‌కుమార్ , లక్ష్ –ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రైనర్ మంజుల పాల్గొన్నారు.